13032024-DIS-07_Layout 1 3/13/2024 1:54 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## మీకిది న్యాయమా?

న్యాయమూర్తులు రాజకీయాల్లో చేరొచ్చా? అనే ప్రశ్న మన రాజ్యాంగం ఊపిరి పోసుకున్న నాటి నుంచీ ఉన్నది. జడ్జిలు పరిపాలన పరమైన పదవులు చేపట్టకుండా నిషేధం విధించాలనే సూచన అప్పట్లోనే వచ్చింది. కానీ రాజ్యాంగసభ అందుకు సమ్మతించలేదు. బయటినుంచి నిబంధనలు రుద్దడం వల్ల న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసినట్టవుతుందని భావించడమే అందుకు కారణం. జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ వంటివారు భవిష్యత్తులో న్యాయవ్యవస్థను ఇరకాటంలో పడేస్తారని బహుశా వారు ఊహించి ఉండరు. గంగోపాధ్యాయ కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి పదవికి ఇలా రాజీనామా చేసి, అలా బీజేపీలో చేరిపోవడం దేశవ్యాప్తంగా చర్చాంశమైంది. 'పార్టీ కోసం సైనికుడిలా పనిచేస్తానని' ఆయన ప్రకటించడం విమర్శలకు దారితీసింది. గంగోపాధ్యాయకు వివాదాలు కొత్తకాదు, హైకోర్టు న్యాయమూర్తిగా ఉంటూనే ఆయన ఓ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పశ్చిమబెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ సర్కారును విమర్శించారు. ముడుపులకు బడి ఉద్యోగాలు కేసును ప్రస్తావించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు ముందుకు వచ్చినప్పుడు విచారణలో ఉన్న కేసులపై జడ్జిలు టీవీ ఇంటర్వ్యూలు ఇవ్వడం సబబు కాదని స్వయంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఘాటుగానే మందలించారు.

న్యాయమూర్తుల తీరుతెన్నులపై నియంత్రణలు ఉండాలా, వద్దా అనే ప్రశ్న గంగోపాధ్యాయ ఉదంతంతో మరోసారి ప్రముఖంగా ముందుకువచ్చింది. ఒక న్యాయవాది.. న్యాయమూర్తి పదవిని అంగీకరించారంటే వ్యక్తిగత స్వేచ్ఛను త్యాగం చేసినట్టే. ఎందుకంటే న్యాయమూర్తి పదవిని చేపట్టినవారు అన్ని విషయాల్లో సంయమనం పాటించాల్సి ఉంటుంది. అలాగే వ్యక్తిగత ఆకాంక్షలనూ వదులుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో రాజ్యాంగబద్ధ న్యాయపీఠాన్ని అధిష్ఠించే న్యాయమూర్తికి అపరిమితమైన అధికారాలు, గౌరవాలు దక్కుతాయి. ఉన్నత న్యాయస్థానాల జడ్జిలను పార్లమెంటు అభిశంసన ద్వారా మాత్రమే తొలగించవచ్చు. ఇది కష్టసాధ్యమైన విషయమని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఇంతటి విశిష్టమైన పదవిని చేపట్టేవారు రాత్రికిరాత్రే రాజకీయ కండువాలు కప్పుకోవడం విడ్డూరంగానే కనిపిస్తున్నది. గంగోపాధ్యాయ ఆ పనే చేసి చూపించారు.

న్యాయపీఠానికి న్యాయమూర్తి వర్తనే వన్నె తెస్తుందని న్యాయవేత్తలు అంటారు. ఆ వర్తన స్వచ్ఛంగా, సమున్నతంగా ఉండాలి. రాజకీయ పదవులను ఆశించడమనేది ఏ మాత్రం సరిపడే విషయం కాదు. గతంలో కోకా సుబ్బారావు, బహారుల్ ఇస్లాం రాజకీయ ఎన్నికల కోసం న్యాయపదవుల నుంచి వైదొలిగారు. ఇటీవల ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన అనతికాలంలోనే రంజన్ గొగోయ్ రాజ్యసభలోకి ప్రవేశించారు. ఇప్పటిదాకా మినహాయింపులుగా ఉన్న ఈ తరహా రాజకీయ ప్రవేశాలు సాధారణ అంశాలుగా మారితే న్యాయవ్యవస్థ పరిస్థితి ఏమిటో ఊహించుకోవచ్చు. ఈ జాడ్యం మరింత ముదరకముందే సుప్రీంకోర్టు, పార్లమెంట్ సకాలంలో సరైన చికిత్స చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

భారతదేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలను అడుగడుగునా మోసం చేసింది. ప్రతి సందర్భంలోనూ బీసీ వ్యతిరేకతను చాటుకున్నది. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేసింది తప్పితే ఏనాడూ బీసీల ఉద్ధరణకు పూనుకున్న సందర్భాలు లేవు. రాజ్యాంగ రచనా కాలం మొదలు బీసీ రిజర్వేషన్ల సమయం, నిన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వరకు బీసీల ప్రాతినిధ్యాన్ని చట్టసభల్లో కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ వివక్ష చూపింది.

# బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్



నక్క మహేశ్‌యాదవ్
90143 84440




తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ ఉదయపూర్ డిక్లరేషన్ చేసింది. ప్రతి పార్లమెంట్ స్థానానికి బీసీలకు రెండు అసెంబ్లీ టికెట్‌లు కేటాయిస్తామని ప్రకటించింది. ఈ లెక్క ప్రకారం బీసీలకు 34 టికెట్‌లు ఇవ్వాలి. కానీ, 21 సీట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నది. అందులో కొన్ని సీట్లు ఓడిపోయే హైదరాబాద్ ఓల్డ్ సిటీలో ఇచ్చింది. ఉదారవాద విధానాలను అవలంబిస్తున్నామని చెప్పుకొన్న కాంగ్రెస్ పార్టీ అగ్రకులాలకు ప్రభుత్వ పదవులు మొదలు పార్టీ అధ్యక్ష, పీసీసీ పదవులను కట్టబెట్టి, బీసీ నాయకత్వాన్ని ఎదగకుండా తొక్కిపెట్టింది. జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మొదలు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, నేటి రాహుల్‌గాంధీ వరకు బీసీలను తమ ఓటు బ్యాంకుగా వాడుకున్నారే కానీ బీసీల రాజకీయ, ఆర్థిక స్వావలంబన గురించి శ్రద్ధ చూపలేకపోయారు. దళితులకు సంక్షేమ పథకాల్లో కొంత మేర న్యాయం చేసి, దేశ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలను అత్యంత దుర్మార్గంగా అణచివేసింది కాంగ్రెస్ పార్టీ.

బీసీ రిజర్వేషన్ల విషయంలో తమిళనాడులో చేసిన పెరియార్ ఉద్యమం వల్ల భారత రాజ్యాంగానికి మొదటి సవరణ జరిగింది. ఆ తర్వాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజీనామాతో రాజకీయ ఒత్తిడి మేరకు బ్రాహ్మణుడైన కాకా కాలేల్కర్ ఆధ్వర్యంలో మొదటి కమిషన్ ఏర్పాటైంది. ఆ కమిషన్ సిఫారసు అమలుచేయడంలో చిత్తశుద్ధిని చూపకపోగా, వాటిని కాంగ్రెస్ అణగతొక్కింది. ఆ తర్వాత వచ్చిన ఇందిరాగాంధీ బీసీల కోసం కొత్త కమిషన్ వేయలేదు, ఉన్న కమిషన్ సిఫారసులను పట్టించుకోలేదు. మారోజు వీరన్న మాటల్లో చెప్పాలంటే.. బీ(బ్రాహ్మణ) హెచ్(హరిజన) ఏ(ఆదివాసీ) ఎం(మైనార్టీ) పాలసీని అనుసరిస్తూ సంక్షేమ పథకాలు అమలుచేయడంలో బీసీలకు మొండిచేయి చూపింది. ఇందిరాగాంధీ మరణానంతరం అధికారం చేపట్టిన రాజీవ్‌గాంధీ మండల్ కమిషన్ అంశాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. పైగా వీపీ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు చారిత్రాత్మకమైన మండల కమిషన్ అమలును ప్రకటించినప్పుడు ప్రతిపక్ష హోదాలో రాజీవ్‌గాంధీ దాదాపు రెండున్నర గంటల పాటు పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్లపై విషం కక్కాడు. రాజీవ్‌గాంధీ తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పీవీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలుచేయాలని కొంత ప్రయత్నం చేసినా సుప్రీంకోర్టు ఆయన నిర్ణయాన్ని కొట్టివేసింది. రిజర్వేషన్లను అమలుచేయడంలో కాంగ్రెస్ నిర్లక్ష్య ధోరణి కారణంగా దాదాపు ఐదు దశాబ్దాలకు పైగా కేంద్ర, రాష్ట్ర పరిధిలోని ఉద్యోగాల్లో బీసీలు పెద్ద ఎత్తున నష్టపోయారు. కొన్ని లక్షల ఉద్యోగాలు కోల్పోయారు.

ఏపీ, తెలంగాణలో ఇప్పటివరకు బ్రాహ్మణ, వైశ్య, వెలమ, రెడ్డితోపాటు దళితులకు ముఖ్యమంత్రి అవకాశం కల్పించింది కాంగ్రెస్ పార్టీ. కేవలం ఒక్క రెడ్డి సామాజిక వర్గానికే 17 సార్లు ముఖ్యమంత్రి అవకాశం కల్పించింది. కానీ, ఒక్కసారి కూడా బీసీలకు అవకాశం కల్పించలేదు. 2023లో తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మళ్లీ రెడ్డి సామాజికవర్గానికి చెందిన రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసి, దళితుడిని ఉప ముఖ్యమంత్రిని చేసి బీసీలకు నామమాత్రంగా రెండు మంత్రి పదవులను కట్టబెట్టింది. ఇవన్నీ గమనిస్తే కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల వివక్ష, నిర్లక్ష్యవైఖరి ఉన్నట్టు స్పష్టమవుతున్నది. సామాజిక న్యాయం, బీసీ కులగణన పేరిట దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పదవుల పంపకంలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఎందుకు నోరు మెదపడం లేదు. 2016, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కులగణన చేయించారు. ఈ లెక్కలు బహిరంగపరుస్తామని ప్రకటిస్తే కాంగ్రెస్ పార్టీలోని అగ్రకులాలు అడ్డుకుంటున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన ప్రక్రియను పూర్తిచేసి బహిర్గతపర్చలేదు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ ఆసక్తి చూపడం లేదంటేనే బీసీల పట్ల ఆయన వైఖరి నోటితో నవ్వి, నొసటితో వెక్కిరించినట్టు ఉందనేది సుస్పష్టం. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో కనీసం 9 సీట్లయినా బీసీలకు కేటాయించాలి. అప్పుడే సామాజిక న్యాయం చేసినట్టవుతుంది.

> ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన ప్రక్రియను పూర్తిచేసి బహిర్గతపర్చలేదు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ ఆసక్తి చూపడం లేదంటేనే బీసీల పట్ల ఆయన వైఖరి నోటితో నవ్వి, నొసటితో వెక్కిరించినట్టు ఉందనేది సుస్పష్టం.




## కన్ఫ్యూజన్ వద్దు!

ఇది ఎన్నికల కాలం! ఇంకేం తెల్లారకముందే వినపడుతున్న మైకుల శబ్దాల్లో తమ నాయకుల గొప్పతనాన్ని, ప్రతినాయకులపై దూషణను వింటూనే నిద్ర లేస్తున్నాం! ఎక్కడా ప్రజల సమస్యల పరిష్కారాల వాగ్దానాలు వినపడుతున్నట్టు లేదు. ఒక కుటుంబసభ్యులే రాజకీయ మనుగడ కోసం తలా ఒక పార్టీలో తరిస్తూ వారి గురించి మనకు తెలియనట్టు వివరిస్తున్నప్పుడు పొద్దున్నే ఇడ్లీ తినాలా, అట్టు తినాలా అన్నట్టు ఏదో అయోమయం. ఈ వర్తమానంలో ఒక పార్టీ తరపున మాటలు, పాటలు పాడి, అరచి చించుకుంటున్న గొంతుక నిన్నేదో వేరే పార్టీ నాయకుడిని పొగిడినట్టు గుర్తొస్తున్నది. బట్టలూడదీయడాలు, ఊరేగించడాలు, దుష్ట చతుష్టయాలు, బంగాళాఖాతాలు, పాతాళలోకాలు, క్లాస్ వార్‌లు, కోల్డ్ వార్‌లు, ఇంకా ఈ జనరేషన్‌కు పరిచయం లేని ఎన్నో కొత్త పదాలతో తెలుగు భాష కొత్త రూపాన్ని చూసి టిఫిన్ తర్వాత కాఫీనా, టీనా ఏది తాగాలో తికమకగా ఉన్నది.

ప్రజలకు మాత్రం ఇది ఎన్నికల కాలం, ప్రజల చైతన్యానికి ఒక పరీక్షా కాలం. కానీ రాజకీయ నాయకులకు ఇది ఎన్నో కలల కాలం! కన్న కల వర్తమానంలో నెరవేరని నాయకుడి భవిష్యత్తు కార్యాచరణ కార్యకర్తలకు సంబంధం లేని విధంగా నాలుక మూడు మడతల్లోంచి మూడు శబ్దాలతో, మూడు కొత్త వాగ్దానాలు రావచ్చు. మూడు నాలుగు పార్టీల కూటమితో ముచ్చటగా పొత్తులు కుదురుకోవచ్చు. మూడు పార్టీల జెండాలను మీటింగుల్లో అటూఇటూ ఊపుకుంటూ భుజాన మోస్తూ, కలగాపులగమైన రంగుల, హంగుల నినాదాలతో మనల్ని కన్ఫ్యూజ్ చేయవచ్చు. రాష్ట్ర ప్రజల బాగుకోసం రవ్వంత రంగు మారిందని బుకాయించవచ్చు. ముందు పదవి అనుభవించిన కాలంలో ప్రజలకిచ్చిన వాగ్దానాల మ్యానిఫెస్టో అంటూ ఒకటున్నదని గుర్తులేకపోతే మళ్లీ 'ఆకాశం దించాలా, నెలవంకా తుంచాలా, శిగలో ఉంచాలా?' అని ప్రేమికులను అడిగినట్టుగా అడిగి తమ పార్టీల పటిష్టతను, సమైక్యతను, ప్రజాస్వామ్య విలువలను గురించి ధనస్వామ్యంలో ఉద్భవించిన రంగుల కలువల పరిమళం మన ముక్కుపుటాలకు చేరినప్పుడు, కడుపు నిండిపోయిన ఫీలింగ్‌తో భోజనం అవసరం కూడా లేకపోవచ్చు.

ప్రతి పది నిమిషాలకోసారి టీవీల్లో వస్తున్న రాజకీయ ప్రకటనల్లో మునిగి మీ ఉనికి మీరు మరచిపోవచ్చు. ఇదిలా ఉంటే ఈ పాత్రలన్నీ బయోపిక్‌ల రూపంలో సినిమాల్లో జొరబడి ఎవరికో నచ్చిన, నచ్చని కథ సినిమాగా రావడం, దాని గురించి కోర్టులు, మనం కూడా కన్ఫ్యూజన్‌లో పడటం జరుగుతున్నది. ప్రతిపక్షంలో అపరిచితుడైన నాయకుడు ప్రభుత్వంలోకి వస్తే ఏమీ తెలియని అమాయకుడైన 'రామం'గా మారవచ్చు. గుడిలో విబూది నామాలు, బరిలో రాజకీయ పాతాలు, చర్చిలో ప్రార్థనలు, మసీదుల్లో నమాజ్‌లు, రైతు ఉద్యమాల్లో తలపాగాలు, ఇవన్నీ తమ వ్యక్తిగత నటనా చాతుర్యాలని, అధికారపు ఆకాంక్షలని ప్రజలు గుర్తించలేరనే వారి భావనలో బలం ఉండవచ్చు. వీటన్నింటితో పని లేకుండా పాటల డీజే స్పీకర్ల గర్జింపులు, పాదయాత్రలతో పలకరింపులు, ఇవన్నీ మీ గుమ్మం గడప తొక్కి ఓటు కోసం మీ క్షేమాలు విచారిస్తునప్పుడు పొంగిపోకుండా, మీ మనసులో ఉన్న నాయకుల కోసం కుంగిపోకుండా, రాష్ట్ర సంక్షేమం విషయాన్ని కన్ఫ్యూజన్ లేకుండా గుర్తుచేయండి. మీ ఆలోచనలకు తగ్గ నాయకునికి, మీరు గుర్తించగలిగిన వానికి పార్టీతో పని లేకుండా తప్పక ఓటు వేయండి. మనకెందుకులే అనుకుంటూ మనం నిద్ర నటిస్తే... గుక్కెడు నీళ్ల కోసం, పట్టెడన్నం కోసం కొత్తగా కొలువుదీరే ప్రభుత్వాల కోసం పడిగాపులు కాసే వాళ్లెంతోమంది శాశ్వత నిద్రలోకి జారుకుంటారు.



జోస్యుల వేణుగోపాల్
94404 36806

## లేఖ

### పింఛన్ల పెంపు ఎప్పుడో?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు పూర్తయ్యాయి. 'డిసెంబర్ 9నే హామీలన్నీ అమలు చేసి తీరుతాం' అని నాడు ప్రచారంలో ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు.. పాలకులుగా మారాక కనీసం వాటి ఊసే ఎత్తకపోవడం శోచనీయం. పింఛన్లు పెరుగుతాయని ఆశించిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను కాంగ్రెస్ నిండాముంచింది. పింఛన్ల పెంపు సంగతి దేవుడెరుగు.. కేసీఆర్ సర్కార్ ఇచ్చిన విధంగా ఆసరా పింఛన్‌ను సమయానికి ఇస్తే చాలనే దుస్థితి ఏర్పడటం ఆందోళనకరం.

కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మిన పింఛనుదారులు ఆ పార్టీకి పట్టం గట్టారు. అయితే నమ్మినవారిని నట్టేట ముంచే హస్తం పార్టీ తన పేరును సార్థకం చేసుకున్నది. నాడు గప్పాలు కొట్టిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించి మూడు నెలలైనప్పటికీ రూ.2 వేలే ఇస్తున్నారు. కొత్త పింఛన్ల మంజూరుపై కూడా సప్పుడు చేయడం లేదు. ఆరు గ్యారెంటీల దరఖాస్తుల్లో భాగంగా గతంలో తీసుకున్న దరఖాస్తులు ఏ మూలన పడ్డాయో తెలియదు. వాటిని పరిశీలిస్తారో? తిరస్కరిస్తారో? తెలియడం లేదు. 'కుటుంబంలోని ఒక్క వృద్ధునికే కేసీఆర్ సర్కార్ పింఛన్ ఇస్తున్నది. కాంగ్రెస్ ఇద్దరికీ ఇస్తుంది' అని నాడు గప్పాలు కొట్టి, ఇప్పుడు ఆ సంగతే మర్చిపోవడం విడ్డూరం.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ప్రజా పాలన అని చెప్తున్నారే తప్ప ఆచరణలో ఎక్కడా ప్రజాపాలన కనిపించడం లేదు. దరఖాస్తుల పరిశీలన పేరిట కాలయాపన చేస్తుండటంతో అర్హులైన పేదలు నష్టపోతున్నారు. మా ఊరు సంస్థాన్ నారాయణపురానికి చెందిన ఓ ఒంటరి మహిళ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నది. వాస్తవానికి ఆమె రెండు విధాలా అర్హురాలు. అయినా నాయకుల అలసత్వంతో ఆమెకు పింఛను రావడం లేదు. దరఖాస్తుల పేరిట కాలయాలన చేయకుండా వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. పత్రికల ద్వారా వెలుగులోకి వచ్చిన సమస్యలపై కూడా స్పందించి, వాటిని పరిష్కరించినప్పుడే ప్రజాపాలన అవుతుంది. పాలకులు, అధికారులు స్పందించి అర్హులకు పింఛన్లు అందించాలి. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలి. అంతేకానీ మాటలతో మార్పు జరుగుతుందనుకోవడం పొరపాటు.

**- గుండమల్ల సతీష్ కుమార్**

# లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకీయం



స్వామి ఆర్వీవీయస్




కర్ణాటక ఓటరు ఎల్లప్పుడూ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను, లోక్‌సభ ఎన్నికలను విభిన్నమైన దృక్పథంతో చూస్తున్నాడు. 1984-85లో రామకృష్ణ హెగ్డే నేతృత్వంలోని అధికార జనతా పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా, కొన్ని నెలల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ సాధించింది. గత నాలుగు పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఫలితాలు భిన్నంగా వెలువడ్డాయి.

2008లో మెజారిటీకి మూడు సీట్లు తక్కువ కావడంతో ఇండిపెండెంట్ల మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటుచేసింది. మరుసటి ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాలకు గాను 19 గెలుచుకున్నది. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. చీలిపోయిన కర్ణాటక జనతా పక్ష (కేజేపీ)కి యడ్యూరప్ప నేతృత్వం వహించడంతో బీజేపీలో చీలిక వచ్చింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు యడ్యూరప్ప తిరిగి బీజేపీలో చేరారు. ఆ మరుసటి ఏడాదే 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 17 సీట్లు వచ్చాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ మెజారిటీ రాకపోవడంతో జేడీఎస్, కాంగ్రెస్ కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.


> 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్ కూటమి భాగస్వాములుగా పోటీ చేసి చెరో సీటుతో సరిపెట్టుకున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ 25 సీట్లు గెలుచుకొని తన అత్యుత్తమ పనితీరును కనబరిచింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. 2024 లోక్‌సభ బరిలో ఓటర్ల మద్దతును పొందడానికి ఇద్దరు ప్రధాన పోటీదారులు తలపడనున్నారు.

జేడీఎస్‌తో పొత్తు పెట్టుకోవడం ద్వారా కాంగ్రెస్‌తో ఎన్నికల పోటీని ప్రత్యక్ష పోరుగా మార్చాలని బీజేపీ వ్యూహాత్మకంగా నిర్ణయించింది. ఈ పొత్తును రెండు కోణాల్లో చూడాల్సిన అవసరం ఉన్నది. మొట్టమొదటగా ఇది కాంగ్రెస్‌తో ముఖాముఖి పోరుగా మారి రాష్ట్రంలోని అధికార పార్టీకి సవాలు విసురుతుంది. దేశవ్యాప్తంగా బీజేపీ రాజకీయంగా కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తుండటంతో కర్ణాటకలో వ్యూహాన్ని ఆ కోణంలోనే చూడాల్సిన అవసరం ఉన్నది. రెండోది, జేడీఎస్‌తో పొత్తు పెట్టుకోవడం ద్వారా, తన మిత్రపక్షానికి చెందిన కీలకమైన వొక్కలిగ ఓట్లను దక్కించుకోవడం ద్వారా పాత మైసూరు ప్రాంతంలో మరింత లోతుగా చొరబడాలని బీజేపీ భావిస్తున్నది. ప్రాంతీయ పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకున్నప్పుడల్లా మిత్రపక్షం నుంచి బీజేపీలోకి ఓటు మార్పిడి సాగుతుందని గతంలో తేలింది.

బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలకు కర్ణాటక పోటీ కీలకం. 'విజన్ 370'ను చేరుకోవాలంటే కర్ణాటకను నిలుపుకోవడం బీజేపీకి కీలకం. కర్ణాటకలో గట్టిపోటీ ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ భవిష్యత్తుకు కీలకం. ఈ ఎన్నికలను మనుగడ పోరాటంగా జేడీఎస్ భావిస్తున్నది. దీంతో ఈ ఫలితాలు రాష్ట్ర రాజకీయాలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపనున్నాయి. మోదీ ఫ్యాక్టర్, రాష్ట్ర ప్రభుత్వంపై దాడి, పాన్ ఇండియా ఎజెండా, రామమందిరం ఫ్యాక్టర్ అనే నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ భావిస్తున్నది.

> స్పష్టంగా స్థానిక సమస్యలపైనే ఎన్నికలను ఎదుర్కోవాలని కాంగ్రెస్ సిద్ధపడుతున్నది. రాష్ట్రంపై వివక్షను ఎత్తిచూపుతూ కేంద్రంపై ముఖ్యమంత్రి చేస్తున్న పోరాటమే ఈ ప్రచారంలో ప్రధానాంశంగా కనిపిస్తున్నది. ఐదు హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వారు ప్రాధాన్యం ఇస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. కేంద్రంపై దాడి కన్నా ఐదు హామీల అంశమే ఎక్కువ ప్రభావం చూపేదిగా కనిపిస్తుంది.

ఎట్టకేలకు 2024 లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో అభ్యర్థుల ఎంపికలో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటికే బీజేపీ తన అభ్యర్థులను మారుస్తుందనే టాక్ వినిపిస్తోంది. కాంగ్రెస్ కూడా 2024 ఎన్నికల్లో ఎవరిని బరిలోకి దింపాలనే దానిపై జోరుగా చర్చ సాగుతున్నది. జేడీఎస్‌కు తాము పోటీ చేసే సీట్లపై ఆధారపడి ఉంటుంది. పార్టీలకతీతంగా ఒక ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తున్నది. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడం కంటే రాష్ట్ర రాజకీయాల్లోనే ఉండాలని అన్ని పార్టీల నాయకులు కోరుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వెనుకాడుతున్నారు. 28 లోక్‌సభ స్థానాలకు పోటీ ఊపందుకోవడంతో వచ్చే రెండు నెలల్లో రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలు రసవత్తరంగా మారనున్నాయి.




## లౌకికవాదం మూలాలపై ప్రత్యక్ష దాడి

మతం ప్రాతిపదికన పౌరసత్వం ఇవ్వడాన్ని మీరెక్కడైనా చూశారా? ఎప్పుడైనా విన్నారా? మోదీ సర్కార్ చర్యలు మానవత్వాన్ని అవమానించేలా ఉన్నాయి. దీనివల్ల దేశ ప్రాథమిక సూత్రాలకు ముప్పు ఏర్పడుతుంది. ఇది ముమ్మాటికీ లౌకికవాదం మూలాలపై ప్రత్యక్ష దాడే అవుతుంది.



**- మమతాబెనర్జీ,** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి